
కథలోని మార్కెట్ మా ఇంటికి ఎదురుగానే ఉంటుంది. అక్కడకు వచ్చే బిచ్చగాళ్ల
జీవితాలను గమనించే క్రమంలో ఎదురైన పాత్రలే జాలిగాడు, సరసి.
ఇక మాబుగాడు మా ఊర్లో తలలో నాలుకలా తిరిగే
అనాథలాంటి ఆత్మీయుడు. సుబ్బులు స్వయానా మా నాన్న.
కథా గాఢతకోసం, సంఘర్షణ కోసం కొన్ని సన్నివేశాలు, తత్వగీతాలు,
పాత్రల తీరుతెన్నులు నే మలచినవే అయినా పునాది మాత్రం యథార్థమే.

ఎ. రవీంద్రబాబు

# 7

# నీ ఇల్లు యాడనే చిలుకా...!?

చారి పి.ఎస్.





మార్కెట్ పంచలో పులిజూదం జోరుగా సాగుతోంది. 'పులులు గెలుస్తాయా? మేకలు గెలుస్తాయా?' అని ఆడే సుబ్బులు, శేషయ్య కంటే చుట్టూ చేరినోళ్లకే ఎక్కువ ఆరాటంగా ఉంది. పై పందేలు కాసేవాళ్లు సైతం కళ్లు, పళ్లు బిగబట్టి చూస్తున్నారు. మార్కెట్‌లో చేపలోళ్లు, కూరగాయలోళ్లు, సోడాలోళ్లు, ఈరిపెన్లు చెక్కదువ్వెన్లు మొలతాళ్లు అమ్మేవాళ్లు, బురగంజ, ముంత మామిడికాయలు, చాపలు, రొయ్యలు అమ్మేవాళ్లు... కొనేవాళ్లు ఎవరి హడావుడిలో వాళ్లు ఉన్నారు.

పంచకు ఎడంపక్కన ముసలయ్యగారి కట్టవను ఆనుకొని సరసి రాజేసిన పొయ్యిమీద సట్టిలో సవురుపక్కెల పులుసు సలసలా కాగుతోంది. ఆ వాసనకు మార్కెట్ అంతా ఘుమఘుమలాడుతోంది. సరసికి ఏమవుతాడో తెలియదుగాని జాలిగాడు పొయ్యి పక్కనే కూర్చొని గంజాయి కొడ్తూ ముల్లోకాల్లో తేల్తున్నాడు. రేకులషెడ్‌పై స్తంభానికి తగిలించి ఉన్న పంజరంలో చిలుక జామపండు తింటూ ఏవేవో మాట్లాడుతోంది.

వీటన్నిటితో సంబంధం లేకుండానే పులిజూదం రంజుగా సాగుతోంది. అరగంటనుంచి సుబ్బులు పెళ్లాం కట్టవ దగ్గర నిలబడి కేకలేస్తున్నా ఆటలో పడి సుబ్బులు అసలు పట్టించుకోవడం లేదు.

సరిగ్గా అప్పుడే మాబుగాడు ఎక్కడనుంచి వచ్చాడో వచ్చాడు. రేకులమధ్య దోపున్న బారాటి కఱ్ఱను తీసుకుని, పంచలో ఓ పక్కన మూటల్లో సర్దినట్లున్న సరసి, జాలి సామాన్లను చెల్లాచెదురు అయ్యేటట్లు కొట్టాడు. ఆవేశం తగ్గక మూటల్లో ఉన్నవాటిని బయటకు లాగి విసిరేశాడు. గుడ్డలు, అద్దం, విభూధి, కుంకుమ, గంధం ఉన్న డబ్బాలు, వంకర్లు తిరిగిన కఱ్ఱ... అన్నీ చిందరవందర అయ్యాయి. జాలిగాడు తూల్తూ అడ్డం వస్తే వాడి మీదకీ కఱ్ఱెత్తాడు. ఆ దెబ్బ తగిలితే తల పగలడం ఖాయం అనుకున్న సుబ్బులు ఒక్క అంగలో ఆటదగ్గర నుంచి లేచొచ్చి మాబుగాడి చేతిలో ఉన్న కఱ్ఱ పట్టుకున్నాడు. సరసి భయంతో పరుగున వచ్చి మాబుగాడ్ని వెనక నుంచి వాటేసుకుంది. అయినా మాబుగాడు తప్పించుకొని వెళ్లి పొయ్యిమీదున్న సట్టిని కొట్టాడు. సట్టి పగిలి పులుసు పొయ్యినిండా పడింది.

ఇట్టా కాదని మాబుగాడ్ని సుబ్బులు, శేషయ్య, ఇంకో ఇద్దరు పట్టుకున్నారు. అయినా మాబుగాడు చేతిలో ఉన్న కర్రను పంజరం కేసి కసిగా విసిరేసాడు. అదెళ్లి పంజరానికి గెట్టిగా తగిలింది. పంజరం ఊడి కిందపడింది. దాని తలుపు తెరుచుకుంది. ఇదే సందు అన్నట్లు చిలుక ఎగిరిపోయింది.

మాబుగాడు అలవికాకపోవడంతో సుబ్బులు చెంపకు పట్టి గట్టిగా ఒక్కటి పీకాడు. తూలుతూ కిందపడ్డాడు. శేషయ్య లేపి పంచలో ఓ మూల కూర్చోబెట్టాడు. అయినా వాడు అర్థమై అర్థంకానట్టు ఏదేదో వాగుతూ, మధ్యమధ్యలో పైకి లేవబోయి అక్కడే కూలబడుతున్నాడు.

అప్పటిదాకా గమ్ముగున్న జాలిగాడు, "ఈ నా కొడుకును బతకనివ్వను. సంపేస్తా. ఏదో పొట్టకూటి కోసం ఈ ఊరొస్తే ఇంతపని సేస్తాడా? ఈ నాయాలు. వీడ్నొదలను," అని గంజాయి మత్తులో తూలుతున్నాడు.

సరసి ఇదేమీ పట్టనట్లు మళ్లీ పొయ్యి దగ్గరకు వెళ్లి, పగిలిన సట్టిలో మిగిలున్న పులుసును వేరే సట్టిలోకి పోసి, ఆరిపోయిన పొయ్యిని రాజేస్తోంది.

"నువ్వు నన్ను కొట్టినందుకు కాదు సుబ్బులన్నా!! ఈ జాలిగాడు ఏంజేశాడో తెలుసా...?" అంటూ ఉరికి రాబోయి మళ్లీ కూలబడ్డాడు మాబుగాడు.

"అరే...! ఏం జరిగినా... జరక్కపోయినా... వాళ్ల పొట్టకాడ కూడు కొట్టకూడదు. ఆ చిలుక ఎగిరిపోయింది. అదే వాళ్ల బతుకుదెరువు. రాత్రికి వండుకున్న పులుసు నేలపాలు జేశావ్," అన్నాడు సుబ్బులు.

"అన్నా...! నే జేసిన తప్పులే తెలుసన్నా నీకు. వాడు... వాడు... నా... లచ్మీ కొడుకు." మాటలు రావడంలేదు, మాబుగాడి నోట్లోంచి గాలే వస్తోంది.

జాలిగాడు పంచలో ఓ స్తంభానికి అనుకొని మధ్యమధ్యలో గంజాయి లాగుతూ మాబుగాడ్ని తిడుతూనే ఉన్నాడు.

సుబ్బులు, శేషయ్య మళ్లీ కూర్చొని పులిజూదం మొదలుపెట్టారు. జనాలూ గుమిగూడారు.

పులులు మేకల్ని తింటున్నా, అవి పులుల్ని కట్టేయడానికి ఏ మాత్రం తగ్గడం లేదు.

*

ఆ ఊళ్లోకి అడుక్కు తినేవాళ్లు ఎవరొచ్చినా, ఎన్ని రోజులైనా మార్కెట్ పంచల్లోనే ఉంటారు. రోజంతా అడుక్కొని సాయంత్రానికి పంచల్లో చేరి పక్కనే పొయ్యి పెట్టికొని దొరికిందేదో వండుకొని తింటారు. పైగా మార్కెట్ కావడంతో ఇష్టమైనవన్నీ దొరుకుతాయి. మార్కెట్ వెనకనే సుబ్బులోళ్ల ఇల్లు. ఉత్తరం వైపు

ముసలయ్యోళ్ల ఇల్లు. పగలంతా ఆ పని ఈ పని చేసొచ్చినోళ్లు కాలక్షేపం కోసం మార్కెట్ పంచలో చేరి పులిజూదం, అష్టాచెమ్మా వంటి ఆటలు ఆడుకుంటూ ఉంటారు.

ఇక మాబుగాడు ఊరికి దత్తపుత్రుడు. ఎవరు ఏ పని చెప్పినా చేస్తాడు. డబ్బులిస్తే తీసుకుంటాడు. కాస్త గంజినీళ్లు పోసినా తాగుతాడు. రెండూ కాదంటే రాత్రికి గిన్నె పట్టుకొని వచ్చి, 'వదినా ఆకలేస్తుంది ఏమన్నా ఉంటే పెట్టు,' అని ఎవర్నైనా అడిగే హక్కు, అధికారం ఉన్న మనిషి. వరసలు పెట్టి పిలుస్తాడు కానీ మనసు మాత్రం బంగారం అని ఊరంతా తెలుసు. వాడు తినేది, పడుకునేది, ఉండేది ఆ పంచలోనే.

అలాంటి మాబుగాడిలో జాలిగాడు, సరసి వచ్చిన తర్వాత మార్పు వచ్చింది. జాలిగాడు చిలుకను తీసుకొని జాతకం చెప్పడానికి ఊళ్లోకి వెళ్లగానే సరసి పక్కన చేరేవాడు. కోవిటోళ్ల సులోచన దగ్గర దోరగా కాల్పించి, రెండు దోశలు తెచ్చి ఇచ్చేవాడు. సరసి తింటా ఉంటే, సరదాగా చూస్తూ ఉండేవాడు. వాడి గురించి, వాళ్లమ్మ గురించి, వాళ్ల నాన్న పీరుసాయిబుకు సన్నాయి ఊదడంలో చుట్టుపక్కల ఊళ్లల్లో ఎంతపేరుందో... చెప్పేవాడు. తనకు డోలు వచ్చని తొడల మీద దరువేసు కుంటూ చూపించేవాడు. సరిసి కూడా మాబుగాడి మాటలను ఇష్టంగా వినేది. వాడు రోజూ తెచ్చిచ్చే దోశల్ని ఆశగా తినేది.

సైదు కూతురు దగ్గర కందిబేడంతుండే బొట్టుబిళ్లల పాకెట్ తీసిచ్చాడు. పాండ్స్ పౌడరు కొనిచ్చాడు. అది రాసుకొని, ఆ బొట్టు బిళ్ల పెట్టుకోందే ఊరుకునే వాడు కాదు. ఈరమ్మ ఇచ్చిన పెద్దపళ్ల దువ్వెనతో సరసి దువ్వుకొని, కొబ్బరి నూనె రాసుకొని, జడేసుకొని, మన్నూరు సుగుణమ్మ దగ్గర తను కొనిచ్చిన కనకాంబరాలు, మల్లెపూలు కలిపి కట్టిన దండ పెట్టుకుంటే మాబుగాడికి పండగలా ఉండేది.

మాటల మధ్యలో ఓరోజు అడిగేసాడు, "మీరిద్దరూ మొగుడూ పెళ్లాలా?" అని.

సరసి పెద్దగా నవ్వి, "ఈడా...! నాకు మొగుడేంటి!? నాకు ఇంకా పెళ్లే కాలేదు. మా అమ్మ నేను బమ్మంగారి మటంలో ఉన్నప్పుడు ఈడు పరిచయం అయ్యాడు. అంతకుముందు నేను, మా అమ్మ, మా అమ్మతో ఉండే ఎంకటేసు జట్టుగా తిరిగేవాళ్లం. ఎంకటేసుగాడు శ్రీశైలం దగ్గర వదిలేసాడు మా అమ్మను. మా అమ్మ నన్ను బమ్మంగారి మటంలో వదిలేసి సూరితో పోయింది. నేను ఈడు జతయ్యాం. తిరుపతిలో ఏడు నెలలున్నాం. అక్కడే వీడు నాంచారి దగ్గర చిలుక జాతకం తెలుసుకున్నాడు. ఆ తర్వాత ఇలా తిరుగుతూ ఉన్నాం," అంది.

“నువ్వేమో సూడ్డానికి పాత సినిమాలో జమున లెక్కుంటావు. వాడేమో రమణారెడ్డిలా ఉంటాడు. వాడితో నీకేంటి? ఏం నచ్చి వాడితో...” తడబడుతూనే అన్నాడు.

“నచ్చడం అంటే ఏంటి సెప్పు? నాలుగు రాత్రులు పడుకోవడమా? బాగా సంపాదించి పెడతాడని బతుకంతా వాడికే అతుక్కుపోవడమా? మనసు సెప్పాలి...! గుండె పలకాలి...! నీకు తెలుసా వాడిలో బమ్మాండమైన కళ ఉంది. వాడు గొంతెత్తి పాడాడా... ఈ పపంచమే ఊగిద్ది... ఏదో జీర ఉంది వాడి గొంతులో. అదేరా నాకు పేనం. ఈడికంటే ముందు ఇద్దరితో పరిచయం ఉంది. కానీ ఈడు...” అంది.

మాబుగాడు అలాగే చూస్తా ఉంటే... నెత్తిన ఒకటి కొట్టి మళ్లీ చెప్పింది.

“నవ్వు డోలు వచ్చు అని తొడమీద కొట్టుకుంటూ పాలవరుసలు పలికిస్తావు చూడు. అప్పుడు నీ ముఖం ఎలిగిపోద్ది... మీ నాయన గురించి చెప్తూ పొంగిపోతావు చూడు, అప్పుడు నీ గుండె నిజ్జంగా ఉప్పొంగిద్ది,” అంది.

‘దీని మనసులో ఇంత ఉందా...!?’ అని మాబుగాడు అర్థంకానట్లు అట్లాగే చూస్తూ ఉండిపోయాడు.

*

ఒక్కోసారి ఊళ్లోంచి జాలిగాడు తొందరగా వస్తే, మాబుగాడు ముఖం చాటేసేవాడు కాదు.

“ఏం అన్నా...! ఈరోజు ఎంతమంది జాతకం చెప్పించుకున్నారు?” అని అడిగేవాడు. జాలిగాడూ చెప్పేవాడు. ముగ్గురూ కలిసి మాట్లాడుకునేవాళ్లు.

“అయినా, నీ జాతకమే ఇట్టా ఏడిస్తే! నువ్వు ఇంకొకరికి ఏం చెప్తావు?” అని మాబుగాడు ఎగతాళి చేసినా పట్టించుకోకుండా గంజాయి మత్తుతో ఓ నవ్వు నవ్వేవాడు జాలిగాడు.

ఆ రోజు... పున్నమి చంద్రుడు విరగ్గాస్తున్నాడు. వెన్నెలతో నేలంతా తడిసిపోతా వుంది. పొయ్యిలో చిదుగులు ఆరిపోకుండా నాలుగు ఎండిన కరతమ్మ పుల్లలేసింది సరసి. చల్లటిగాలికి మంట పువ్వుల్లా విచ్చుకుంటోంది. బొమ్మిడాయల కూరతో కడుపునిండా తిన్న జాలిగాడు గంజాయి పట్టించాడు. ఆ మత్తులోంచి గమ్మత్తుగా ఓ రాగం అందుకున్నాడు.

*ఎన్నాళ్లు ఎగిరేవు ఓ చిలుక*
*గడిబిడి సంసారం ఘడియైన నిలువదు*
*ఇల్లు ఇల్లంటావు ఇరుకున పడుతావు*
*నీ ఇల్లు ఉన్నదే బట్టబయలు*

నా మాట వినవే మానస హంస...
నా మాట వినవే ఏ బాధలూ లేక

సచ్చి పుట్టే సంగతి మరిచావా ఓ జీవా...
ఎచ్చులెన్నో ఏమో పలికేవా ఓ జీవా

ఒక్కో తత్వాన్ని జాలిగాడు పాడుతుంటే సముద్రం మీద నుంచి వచ్చే చల్లటి గాలి వంతపాడింది. వెన్నెల వాడిపై జలజలా రాలింది. పంచలో పడుకోవడానికి పక్క సిద్ధం చేస్తున్న సరసి వచ్చి వాడిపక్కనే కూర్చుంది. చుట్ట ముట్టించి దమ్ము లాగుతున్న మాబుగాడు చుట్ట పక్కన పడేసి, వచ్చి నిప్పుల సెగన కాగడం మొదలు పెట్టాడు.

అన్నం తిన్నాక ఏం పాలుబోక, సుబ్బులూ వచ్చి పంచలో చేరాడు. మార్కెట్ పంచలకు దక్షిణాన ఉండే జానికమ్మ పెద్దకొడుకు సీను పెళ్లాన్ని, 'పడుకోవే,' అని, సుబ్బులు పక్కన వచ్చి కూర్చున్నాడు.

బ్రహ్మంగారు ఇల్లు వదిలి వెళ్లేటప్పుడు తల్లికి పిండోత్పత్తి గురించి చెప్పిన తత్వం... కక్కడికి శరీరంలోని చక్రాల గురించి చెప్పిన తత్వం... ఇంకా.. ఇంకా...

చిల్లర రాళ్లకు మొక్కుచునుంటే
చిత్తము చెడిపోనోరే యొరే
చిత్తము నందున చిన్మయ జ్యోతిని
చూచుచు నుండుట సరేసరే...

పాడాడు.

అలా ఆ రాత్రంతా జాలిగాడి గొంతు జీవంతో తొణికిసలాడింది.

అప్పటి నుంచి సుబ్బులే కాదు, వాడు పాడే తత్వాలు విన్న మార్కెట్ చుట్టుపక్కల ఉన్నోళ్లందరూ జాలిగాడి కళకు దాసోహమయ్యారు. మాబుగాడైతే ప్రాణం ఇవ్వమన్నా ఇచ్చేటట్లుగా మారిపోయాడు.

సుబ్బులు, "ఎక్కడ నేర్చుకున్నావు జాలిగా?" అంటే,

"మాది కళాకారుల కుటుంబం సుబ్బులోరు. మా అయ్య భజన కీర్తనలు పాడేటోడు. సిన్నప్పుడు నేనూ అయ్యతోపాటు ఎళ్లేటోడ్ని. జంగాలతో జేరి చాలా నేర్చుకున్నాలే... ఇదిగో, ఇలా దేశాలు పట్టుకు తిరుగుతుంటే ఎక్కడ ఏది బాగనిపిస్తే అది నోటికొచ్చేస్తది. మనసు పెట్టి వినాలేగాని... పాట, సుబ్బులోరూ, గొంతులోకే కాదు గుండెలోకి ఇంకిపోతది," అన్నాడు.

"నువ్వు ఇట్టా ఊళ్లు పట్టుకొని తిరగాల్సినోడివి కాదురా," అని సీనంటే...

వెకిలిగా ఓ నవ్వు నవ్వాడు.

ఓ వెన్నెల కిరణం విరక్తిగా ఆ నవ్వులో విరిగింది.

*

మాబుగాడు సరసికి మార్కెట్లో అమ్మే రెండోరకం చీర, జాకెట్టు కొనిచ్చాడు. ఏకోజామునే లేచి, ఎవరూ లేనప్పుడు సరసి మార్కెట్ బోరుకింద స్నానం చేసింది. ఆ చీర, జాకెట్టు కట్టుకుంది. రోజుకంటే మరింత అందంగా తయారైంది.

జాలిగాడు ఉదయాన్నే పంజరాన్ని తీసుకొని ఊళ్లోకి వెళ్తూ వెళ్తూ... "ఏంటే సరసి ఈరోజు చుక్కలా ఉన్నావ్?" అన్నాడు.

ఆరోజు మాబుగాడు సరసిని చూస్తూ ఎవరు పిలిచినా పనికే వెళ్లలేదు.

రెడ్డిగారి నాగమ్మ వచ్చి, 'బర్రెలకు మేతలేదు. సిటికేసర మండలు ఇరుద్దువు రమ్మం'టే, రానంటే రానన్నాడు. దాంతో, ఆమె నాలుగు తిట్టి పోయింది.

ఉదయం దోశ, మధ్యాహ్నం బుస్సు హోటల్లో చేసిన వెజ్ బిర్యాని తెచ్చి పెట్టాడు. సరసి సంతోషంగా తినింది. ఇద్దరూ కబుర్లు చెప్పుకున్నారు. నవ్వుకున్నారు. మార్కెట్లో చుట్టుపక్కల ఏం జరుగుతుందో అసలు పట్టించుకోలేదు. వాళ్ల లోకంలో వాళ్లు ఉన్నారు.

జాలిగాడు ఆరోజు పొద్దుగూకేటప్పటికి వచ్చాడు. వాడు తెచ్చిన డబ్బులతో రొయ్యలు, మామిడికాయ ఇగురు వండింది. ముగ్గురు కలిసి తిన్నారు. రోజుట్లాగే జాలిగాడు గంజాయి బిగించి సరసి పక్కనే పడుకున్నాడు. మాబుగాడు వాళ్లకు నాలుగడుగుల దూరంలో ఈతాకుల చాపేసుకుని పడుకున్నాడు.

సగం రాత్రప్పుడు జాలిగాడికి మెలుకువ వచ్చింది. పక్కన తడివి చూస్తే సరసి లేదు. అంతా చీకటిగా ఉంది. దూరంగా మాటలు వినిపిస్తున్నాయి. ఆ మాటలు వినిపించే వైపు వెతుక్కుంటూ వెళ్లాడు.

అది కూరగాయలు అమ్ముడుపోగా మిగిలినవి రాత్రి పెట్టుకోవడానికి సుజాత, లచ్చిమి, రావమ్మ ప్రత్యేకంగా వేయించుకున్న గుడిసె. దానిలో నుంచి వినిపిస్తున్నాయి మాటలు. చప్పుడు చేయకుండా జాలిగాడు లోపలికి వెళ్లాడు.

"నాకు నువ్వంటే ఇష్టంలేదు. కానీ నా కోసం నువ్వు పడే తపన నచ్చింది. నన్ను చూసుకుంటున్నావు చూడు, అది బాగనిపించింది. అలాగని నీతో రోజూ ఇలాగే అనుకోకు," సరిసి గొంతు.

"వాడికంటే నేను బాగుంటాను. నిన్ను బాగా చూసుకుంటున్నానని నువ్వే చెప్తున్నావ్. ఇంకేం కావాలి నీకు? నాతో ఉండిపో," అన్నాడు మాబుగాడు.

"నాకు నచ్చదు, బందీ అవడం. ఆ సిలక జూడు. జాలిగాడు సెప్పినట్టు వినాలి. సూపిచ్చిన సైగ పెకారం కార్డు ముక్క తియ్యాలి. వాడేసే జాంపండుతో బతకాలి. పంజరం కదా... ఎలా?"

"నేను అలాకాదు. నీకు నచ్చినట్లు నువ్వు ఉండొచ్చు నా దగ్గర."

“నేను వీడిదగ్గరే బతికినంత కాలం ఉంటానని చెప్పానా? నాకు ఎప్పుడు ఇబ్బంది కలిగితే అప్పుడు... లేదా నా మనసుకు మరో మంచి... కనిపిస్తే... అనిపిస్తే...” అని చెప్తూ సరసి లోగుట్టుగా నవ్వింది.

ఆ నవ్వును బట్టి జాలిగాడు సరసిని కాలితో ఒక్క తన్ను తన్నాడు. తమాయించుకొని ఉలిక్కిపడి సర్దుకుంటూ పైకి లేచింది. జుట్టు పట్టుకొని వంగదీసి మరో రెండు దెబ్బలు కొట్టాడు. మాబుగాడు విడిపించబోతే, వాడ్నీ కొట్టాడు. మాబుగాడు ఎదురు తిరగలేదు. నచ్చజెప్పబోయాడు. జాలిగాడు కోపంతో రగిలిపోయాడు.

ముగ్గురి మధ్య గొడవ బాగా పెరిగింది.

చిలుక ఆ చప్పుళ్లకు నిద్ర లేచి, పంజరంలోనే టపటప కొట్టుకుంది. ఈకలు రాలుతున్నాయి. బాధతో అరుస్తోంది. కానీ పంజరం ఊగుతోందే తప్ప, సువ్వలు మాత్రం విరగటం లేదు.

చివరకు ఏ వేకువజామునో వాళ్ల గొడవ సద్దుమణింది.

మాబుగాడు నిశ్శబ్దంగా అక్కడినుంచి వెళ్లిపోయాడు. ఎక్కడికి పోయాడో తెలియదు.

ఊళ్లోవాళ్లు, ‘మాబుగా...!’ అంటూ మార్కెట్ షెడ్‌లో వెతకటం, ‘ఎక్కడ చచ్చాడో!? పని ఉన్నప్పుడు అసలు కనబడడు,’ అని తిట్టుకుంటూ వెళ్లడం మామూలైంది.

సుబ్బులు, “మాబుగాడు ఎక్కడికెళ్లాడు?” అని అడిగితే,

“నాకేం తెలుసు,” అన్నాడు విసురుగా జాలిగాడు.

సరసి ముఖం చాటేసింది.

*

మూడురోజుల తర్వాత వచ్చిన మాబుగాడు ఇంత నిర్వాకం చేసాడు.

కొంతసేపటికి స్తంభానికి అనుకుని ఉన్న జాలిగాడు పాట ఎత్తుకున్నాడు.

తోలు తిత్తి ఇది తూటులు తొమ్మిది
తుస్సుమనుట ఖాయం
ఓ జీవా తెలుసుకో అపాయం
మూడు రోజులా ముచ్చటరా
ఈ చింత కట్టె దేహం
గాయం గుబిలిపోవు ఖాయం
నీవు కట్టుకపోయేదొట్టిదిరా
మట్టిన పుట్టి మట్టిన కలిసి...

మార్కెట్‌లో జనాలందరూ వాళ్లవాళ్ల పనుల్లో ఉన్నా పాట వింటూ ఉన్నారు. తమలో తాము ఆలోచన చేస్తా ఉన్నారు. ఆటగాళ్లు కూడా పాట వింటూ ఒకరి ఎత్తులను మరొకరు చిత్తు చేస్తున్నారు.

పాట అయిపోగానే జాలిగాడు సుబ్బులు దగ్గరకు వచ్చాడు. గంజాయి వాసనకు ఆట దగ్గరున్నోళ్లందరూ ముక్కు మూసుకుని 'ఛీ' అన్నట్లు ముఖం పెట్టారు.

సుబ్బులు, 'ఏంది?' అన్నట్లు తలెత్తి చూసి, కళ్లతో అడిగాడు

"సుబ్బులోరు నే పాడే ఈ పాటలకీ, తత్వాలకీ, నా బతుక్కి... ఏమన్నా సంబంధం ఉందా? ఈట్నించి నేనేం నేర్చుకున్నాను. బతుకుమీద ఆశ వద్దనుకొనే గదా ఇట్లా వచ్చింది. ఇప్పుడు దీంతో నాకెంతవరకు సాగుతుంది," అంటూ సరసి వైపు ఆప్యాయంగా చూసాడు.

అప్పటివరకు ఆటలో మునిగున్న సుబ్బులే కాదు, మిగిలినోళ్లూ వాడివైపు ఆశ్చర్యంగా చూసారు.

"నిజం... సుబ్బులోరు..! నేనింకా సన్యాసిని కాలేదు. కనీసం సన్నాసిని కూడా కాలేదు. ఎవరికెవరు...? ఇదే నాకు ఎప్పుడూ ఉండాలనుకోవడం, నాకు మాత్రమే ఉండాలనుకోవడం తప్పు... తప్పే..." అన్నాడు.

"ఒరే...! జాలిగా...! నాలుగూళ్లు తిరిగేవాడివి. ఎన్నో పాటలు, వాటిల్లోని రహస్యాల్ని ఒంటబట్టించుకున్నోడివి. నీకు నేనేం సెప్తా చెప్పు," అన్నాడు వాడి కళ్లల్లోకి నేరుగా చూడలేక సుబ్బులు.

"లేదు సుబ్బులోరు. నే తప్పు జేశా. ఈ ప్రక్రుతిలో దేని బతుకు దానిది. దేనిష్టం దానిది. దేన్నీ ఇలా... అలా... అని గీతలు గీయకూడదు. అసలు తప్పులు, ఒప్పులు లేవు సుబ్బులోరు. అన్నీ బూటకం. అంతా నాటకం. మనం పెట్టుకున్నవే! వదిలేస్తా... వదిలేస్తా... ఈ పెపంచకం నామీద రాసిన రాతలన్నిటిని తుడిపేస్తా... తుడి..పే..స్తా..." అంటూ వచ్చి, మాబుగాడు విసిరేసిన వాటిలోంచి వంకర్లు తిరిగిన కర్ర ఒక్కటి తీసుకున్నాడు.

పక్కనే చిలుక ఎగిరిపోయి ఖాళీగా ఉన్న పంజరాన్ని ఎడంకాలితో ఒక్క తొక్కు తొక్కాడు.

పొయ్యి దగ్గర మిగిలిన సవురుపక్కెల పులుసును కాస్తున్న సరసి అంతా గమనిస్తూనే ఉంది. జాలిగాడి మాటలు దూరంనుంచి ఒకటీ అరా వింటూనే ఉంది.

ఎప్పుడైతే జాలిగాడు పంజరాన్ని తొక్కాడో... సరసి కళ్లు మంటల్లోంచి కొత్తగా పుట్టుకొచ్చినట్లు మెరిసాయి.

మాబుగాడు పంచల్లో... మూలన అలాగే కూలబడి, తెరుపుడు పడని కళ్లతో, మైకంలో అర్థమై అర్థంకానట్లు చూస్తా ఉన్నాడు.

జాలిగాడు కఱ్ఱ తీసుకొని మార్కెట్ నుంచి ఉత్తరం దిక్కుగా నడిచాడు. వాడ్ని ఎవరూ ఆపే ప్రయత్నం చెయ్యలేదు. సరసి పైకి లేచి, "ఇదిగో నేనూ వస్తాన్నా," అంటూ చెల్లాచెదురై ఉన్న సామాన్లను ఓ మూట్లో కట్టి వాడెంట నడిచింది.

వెళ్తూ వెళ్తూ మూబుగాడి దగ్గరకొచ్చి, చెవిలో ఏదో చెప్పింది.

ఆ మైకంలో వాడు విన్నాడో లేదో...! విన్నా అర్థమైందో లేదో...!

చూపులు వారెళ్లే దార్లోకి విసిరేసి చూస్తా ఉండిపోయాడు.

ఇంతలో ఎక్కడి నుంచో చిలుక ఎగురుకుంటూ వచ్చింది. జాలిగాడి భుజం మీద వాలింది. వాడు దాన్ని వద్దని తోలలేదు. కావాలని ముద్దు చెయ్యలేదు. అదే అరుస్తూ... జాలిగాడి బుగ్గమీద సుతారంగా కొరికింది.

'దీని దుంపతెగ... దీని పేమ పాడుగాను,' అనుకున్నాడు మనసులో...

పులిజూదం చివరికొచ్చింది.

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*19 జూన్ 2022*

✻




14 డిసెంబర్ 1977న ప్రకాశం జిల్లాలో పుట్టిన ఎ. రవీంద్రబాబు మొదటి కథ తెరిచిన డైరీ 16 ఫిబ్రవరి 2003 ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో అచ్చయ్యింది. ఇప్పటివరకు 34 కథలు ప్రచురితమయ్యాయి. మార్కెట్ కథలు కథాసంపుటి ప్రచురించారు. సాహిత్య విమర్శకు సంబంధించి కొన్ని వ్యాసాలు, పుస్తకాలు ప్రచురించారు. జర్నలిజం వృత్తిలో ఉన్నారు.

*చిరునామా: కేరాఫ్ జి. కిష్టయ్య, ఫ్లాట్ నెం. 41, ఇం.నెం. 8-233/10,*
*సాయినగర్ కాలనీ, కుత్బుల్లాపూర్, మేడ్చల్ మండల్,*
*హైదరాబాద్ 500 054*
*ఫోన్: 80086 36981* **alluri.vennela@gmail.com**